بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 31.05.2024 (Telugu)**

# హజ్రత్ ఖుబైబ్ రజియల్లాహు తఆలా అన్హు అమరులైన సంఘటన ప్రస్తావన
# వివిధ దేశాల పీడితుల కొరకు దుఆల పిలుపు

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 31.05.2024 తేదీన - మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ. اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ. الرَّحْمٰنِ الرَّحِيْمِ. مٰلِكِ يَوْمِ الدِّيْنِ. إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ
نَسْتَعِيْنُ. اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ. صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ.

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

ఒక సరియ్య ప్రస్తావనలో భాగంగా హజ్రత్ ఖుబైబ్ రజియల్లాహు తఆలా అన్హు అమరులైన ప్రస్తావన జరుగుతుండెను. దీని మరిన్ని వివరాలు ఇట్లు వ్రాయబడినవి. కట్టెతో కట్టి షహీద్ (హత్య) చేయబడిన మొట్టమొదటి అనుచరులు వీరే. అనగా శిలువపై వ్రేలాడదీసి షహీద్ చేయబడ్డారు.

అల్లామా ఇబ్నె అసీర్ ఇట్లు వ్రాశారు. అల్లాహ్ మార్గంలో శిలువపై హత్య చేయబడిన మొదటి అనుచరులు హజ్రత్ ఖుబైబ్ (రజి). హత్య సందర్భంన ఇస్లాంను విడిచిపెట్టినచో మిమ్ములను విడిచి పెడ్తామని ఖురైషులు వారికి అవకాశమిచ్చారు. కాని హజ్రత్ ఖుబైబ్ (రజి) ఇట్లు సమాధానమిచ్చిరి. ఇస్లాం మార్గంలో నేను హత్య చేయబడుట ఒక సాధారణమైన విషయం.

అనంతరం అల్లాహ్ తఆలాతో ఇట్లు చెప్పుకున్నారు. ఓ అల్లాహ్! నీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు నా సలాం అందించే వారెవరు ఇక్కడ లేరు. కావున నువ్వే స్వయంగా నా సలాం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అందించుము. మాతో జరిగినదంతయు వారి స.అ.స.కు తెలుపుము. హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. ఒక రోజు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులతో కలిసి కూర్చొని ఉండిరి. అప్పుడే వారి స.అ.స.పై దైవవాణి అవతరించే స్థితి అవతరించడం మొదలైనది. వారు స.అ.స. ఇట్లనిరి. وعلیہ السلام ورحمۃ اللہ وبرکاتہ అనగా అతనిపై కూడ సలాం అల్లాహ్ కరుణ, అనుగ్రహాలు అతనికి కలుగుగాక! దైవవాణి స్థితి ముగిసిన తర్వాత వారు స.అ.స. ఇట్లనిరి. ఇప్పుడిప్పుడే జిబ్రాయీల్ నాకు ఖుబైబ్ (రజి) సలాం అందిస్తుండిరి. ఖుబైబ్ (రజి) ను ఖురైషులు హత్య చేసిరి.

కథనాలలో ఇట్లు గలదు. ఎవరి తండ్రి లేదా తాత బదర్ యుద్ధంలో హత్యకు గురైనారో అటువంటి 40 మందిని ఖురైషులు హజ్రత్ ఖుబైబ్ (రజి) హత్యా సమయంన పిలిపించుకున్నారు. ఆయా ఖురైష్ ప్రజలలో ప్రతి ఒక్కరికి ఒక్కొక్క బర్ఛీ ఇచ్చి, ఈ వ్యక్తియే మీ తండ్రి, తాతను హత్య చేశాడని చెప్పబడెను. కావున అప్పుడు ఆయా ప్రజలు తమ బర్ఛీలతో నెమ్మది నెమ్మదిగా గాయపర్చినారు.

ఫలితంగా హజ్రత్ ఖుబైబ్ (రజి) శిలువపై చాలా ఆందోళనకు గురైరి. ఖుబైబ్‌నొక ప్రక్క తిరిగినప్పుడు వారి ముఖం కాబా వైపు అయినది. అప్పుడు వారిట్లనిరి. అల్లాహ్ తఆలా ఇష్టపడి నా ముఖంను కాబా వైపునకు త్రిప్పిన అల్లాహ్‌కే సర్వ ప్రశంసలు. అనంతరం అన్యారాధకులు ఖుబైబ్ (రజి)ను హత్య చేసిరి. అన్యారాధకులు మొదట హజ్రత్ ఖుబైబ్ (రజి)కు బర్ఛీలను కుచ్చి తీవ్ర ఇబ్బందికి గురి చేసిన తర్వాత వారిని హత్య చేశారని దీనితో తెలుస్తుంది.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఇట్లనిరి. ఖురైష్ నాయకుల గట్టి శత్రుత్వం తగ్గించగల దయ, న్యాయ భావానికి అవకాశమే లేకుండెను. ఇంకా ఎక్కువ రోజులు గడవక ముందే బనూ హారిస్ ప్రజలు మరియు ఇతర ఖురైష్ నాయకులు ఖుబైబ్ (రజి)ను హత్య చేయుటకు, వారి హత్యపై సంబరాలు జరుపుకొనుటకు వారి (రజి) ని ఒక విశాల మైదానానికి తీసుకొని వెళ్లిరి. వారు (రజి) మరణించే ముందు రెండు రకాతులు నవాఫిల్ చదువుటకు అనుమతి కోరిరి. ఎంతో శ్రద్ధతో నవాఫిల్ చదివిన తర్వాత ఇట్లనిరి. నమాజ్‌ను ఇంకా పొడిగించాలని నేను ఆశిస్తుంటిని. కాని నేను మృత్యువు భయంతో నమాజ్‌ను పొడిగిస్తున్నాని మీరు భావిస్తారని నమాజ్ త్వరగా ముగించాను. అనంతరం ఖుబైబ్ (రజి) ఈ పద్యమును చదువుతు ముందుకు తల వంచిరి.

అనగా ఇస్లాం మార్గంలో ముస్లిం అయిన స్థితిలో నేను హత్యకు గురవుతున్నప్పుడు హత్యానంతరం నేను ఎటు వైపు పడతానో నేను లెక్క చేయను. ఇదంతా అల్లాహ్ తఆలా కొరకు అయినందున అల్లాహ్ కోరినచో నా శరీరం ముక్కలు ముక్కలు అయిన తర్వాత కూడ వాటిలో శుభాలను కలిగించగలడు.

హజ్రత్ ఖుబైబ్ (రజి) అమరులగుతున్న సందర్భంలో ఇట్లు దుఆ చేసిరి. ఓ అల్లాహ్! ఈ క్రూరులను ఒక్కొక్కరిని పట్టుకొని హతమార్చుము. అనంతరం కథనాలలో ఇట్లు గలదు. ఇంకా ఒక్క సంవత్సరం గడవక ముందే ఈ హత్యలో పాల్గొన్న క్రూరులందరు హతమైరి. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇది రుజువు కాలేదు. ఇంకా ఒక్క సంవత్సరం గడవక ముందే వీరందరు హతమైనట్లు ఇతర కథనాలలో లభించదు. వారిలోని అధికులు చనిపోయారు లేదా మక్కా విజయం వరకు ఇస్లాం స్వీకరించారని చెప్పవచ్చును. ఈ విషయంను ప్రస్తావిస్తు ఒక చరిత్రకారుడు ఇట్లు వ్రాసెను. ఖుబైబ్ (రజి) నోట ఈ మాటలను విన్న అన్యారాధకులలో వణుకు పుట్టెను. ఖుబైబ్ (రజి) గారి ఈ శాపం వృథా కాదని వారికి నమ్మకముండెను. ఖురైష్ ప్రజలలో ఈ శాపం గురించి చాలా చర్చ కొనసాగెను. ఒక నెల లేదా అంతకంటే ఎక్కువ వరకు వారి సమావేశాలలో ఖుబైబ్ (రజి) శాపం గురించి భయం అలముకునెను. దీనిపై వారు వివిధ రకాలుగా చర్చించుకునేవారు.

ఏ సమావేశంలో హజ్రత్ ఖుబైబ్ (రజి) షహీద్ చేయబడిరో అందులో సయీద్ బిన్ ఆమిర్ అనే వ్యక్తి కూడ పాల్గొనెను. ఈ వ్యక్తి తర్వాత ఇస్లాం స్వీకరించెను. హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ కాలం వరకు అతని పరిస్థితి ఎట్లుండెననగా అతనికి హజ్రత్ ఖుబైబ్ (రజి) అమరులైన సంఘటన గుర్తుకు వచ్చినప్పుడు అతడు స్పృహ కోల్పోయేవాడు. సయీద్‌ను హజ్రత్ ఉమర్ (రజి) సిరియా దేశంలో ఒక చోట ఆమిల్ (అధ్యక్షుని)గా నియమించిరి. ప్రజలు ఈ సంఘటనను పరస్పరం ప్రస్తావింకున్నప్పుడు కూడ వారు స్పృహ కోల్పోయేవారు. ఈ విషయంను ప్రజలు హజ్రత్ ఉమర్ (రజి)తో ప్రస్తావిస్తు మీరు

మాపై ఒక రోగిని అధ్యక్షునిగా నియమించారని ఫిర్యాదు చేసిరి. హజ్రత్ ఉమర్ (రజి)తో భేటి అగుటకు సయీద్ బిన్ ఆమిర్ వచ్చినప్పుడు వారు (రజి) వారితో ఇట్లడిగిరి. ఓ సయీద్! నీకు ఏదైనా వ్యాధి సోకిందా? సయీద్ బిన్ ఆమిర్ ఇట్లు సమాధానమిచ్చిరి. నాకెలాంటి వ్యాధి సోకలేదు. అసలు విషయం ఏమనగా హజ్రత్ ఖుబైబ్ (రజి)ను హత్య చేస్తున్నప్పుడు నేను కూడ అక్కడే ఉంటిని. ఇప్పటికి హజ్రత్ ఖుబైబ్ (రజి) ఆ దుఆ గుర్తు వచ్చినప్పుడు నేను స్పృహ కోల్పోతుంటాను.

హజ్రత్ ఖుబైబ్ (రజి) శవం కుల్లిపోవాలనే ఉద్దేశంతో దానిని ఖురైష్‌లు శిలువపైనే వదిలి పెట్టిరి. హజ్రత్ ఖుబైబ్ (రజి) శవాన్ని శిలైవపై నుండి దింపాలని పిలుపునిస్తు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీలో ఎవరు హజ్రత్ ఖుబైబ్ (రజి) శవాన్ని శిలైవ పై నుండి దింపగలరు. బదులుగా హజ్రత్ జుబైర్ బిన్ అవ్వామ్ (రజి) ఇట్లనిరి. ఓ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం! నేను మరియు నా సహచరుడు మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి). వీరిద్దరు ఆ శవం వద్దకు చేరుకున్నప్పుడు అక్కడ 40 మంది ఉన్నట్లు చూశారు. కాని వారందరు నిస్పృహ స్థితిలో నిద్రిస్తుండిరి. వీరిద్దరు హజ్రత్ ఖుబైబ్ (రజి)ను క్రిందికి దించిరి. ఇది హజ్రత్ ఖుబైబ్ (రజి) అమరులైన 40 రోజుల తర్వాతి సంఘటన.

చరిత్ర పుస్తకాలలో ప్రస్తావించబడిన కథానల ప్రకారం హజ్రత్ ఖుబైబ్ (రజి) శవాన్ని తీసుకొచ్చుటకు మరికొందరు వ్యక్తులు వెళ్లినట్లు తెలుస్తుంది. మరొక కథనం మేరకు హజ్రత్ అమర్ బిన్ ఉమయ్యహ్ (రజి)ను ఒంటరిగా ఈ పని కొరకు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నియమించిరి. మరొక కథనంలో హజ్రత్ అమర్ బిన్ ఉమయ్యహ్ (రజి)తో హజ్రత్ జబ్బార్ బిన్ సఖర్ (రజి) పేరు కూడ ప్రస్తావించబడెను. వారిట్లు ఉల్లేఖించారు. మేము శవంను శిలువపై నుండి దింపాము. ఖురైష్‌లు మమ్ములను వెంబడించినప్పుడు మేము హజ్రత్ ఖుబైబ్ (రజి) శవాన్ని నదిలో పడేశాము. ఈ విధంగా అల్లాహ్ తఆలా హజ్రత్ ఖుబైబ్ (రజి) శవాన్ని అవిశ్వాసులకు దొరకకుండా చేసెను. హుజూరె అన్వర్ ఇట్లనిరి. వారి శవాన్ని అవమానపర్చకుండా అల్లాహ్ తఆలా రక్షించెను. అవిశ్వాసులు సంకల్పించిన విధంగా చేయలేకపోయారు. అల్లాహ్ తఆలా ఈ విధంగాను తన ప్రియులను రక్షిస్తాడు. శత్రువుల దుశ్చర్యల నుండి శవాలను అల్లాహ్ తఆలా రక్షించిన అనేక సందర్భాలు లభిస్తాయి. గత సారి కూడ టీగలు, తేనె టీగల నుండి శవాన్ని అవమానపర్చకుండా కాపాడిన ఒక సంఘటనను నేను వినిపించాను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ సరియ్య ప్రస్తావన ఇక్కడ ముగిసినది.

నేను దుఆల గురించి పిలుపు ఇస్తుంటాను. పాలస్తీనీయుల కొరకు దుఆ చేయండి. అది ఇప్పుడు ఒంటరిగా మిగిలిపోయెను. రఫాను దాటి మేము దాడి చేయమని ఇంతకు ముందు అమెరికా చెప్పెను. అలా కాదని, ఇంకా ముగియలేదని ఇప్పుడు అంటున్నారు. వీరి రెడ్ లైన్ ఎంత వరకో తెలియదు? ఎన్ని లక్షల మందిని వీరు హతమార్చుతారో, ఎప్పుడు స్పందిస్తారో తెలియదు. ఈ క్రూరుల నుండి అల్లాహ్ తఆలా ప్రపంచాన్ని రక్షించుగాక! పీడిత పాలస్తీనీయులను కూడ రక్షించుగాక! ఆమీన్

ఇదే విధంగా సూడాన్ ప్రజల కొరకు కూడ దుఆ చేయండి. అక్కడ స్వంత జాతి ప్రజలే, ముస్లింలే ముస్లింలను చంపుతున్నారు. అల్లాహ్ తఆలా వారికి కూడ సద్బుద్ధి ప్రసాదించుగాక! అల్లాహ్ తఆలా శిక్ష నుండి తప్పించుకొందురుగాక! అతని ఆదేశాలను పాటింతురు గాక! యెమెన్ ఖైదీల కొరకు

కూడ దుఆ చేయండి. పాకిస్తాన్ అహ్మదీయుల కొరకు కూడ దుఆ చేయండి. అక్కడ కూడ పరిస్థితులు తల క్రిందులవుతుంటాయి. పండుగ సమీపిస్తున్నది. ఆ రోజులలో మౌల్వీలు మరింత క్రియాశీకంగా మారుతారు. అల్లాహ్ తఆలా ప్రతి అహ్మదీని ప్రతి బాధ నుండి రక్షించుగాక! ఖైదీల విడుదల కొరకు అల్లాహ్ తఆలా త్వరగా తగిన ఏర్పాట్లు చేయుగాక! ఆమీన్

ఖుత్బా చివరి భాగంలో హుజూరె అన్వర్ ఇద్దరు మృతుల మరణ వార్త తెలిపి వారి సద్గుణాలను ప్రస్తావించి వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించిరి.

(1) గౌ॥ చౌధ్రి మునీర్ అహ్మద్ గారు మురబ్బి సల్సిల డైరెక్టర్ ఎమ్.టి.ఏ. ఇంటర్నేషనల్ టెలిపోర్ట్ అమెరికా. గత కొద్ది రోజుల క్రితం 73 సంవత్సరాల వయసులో వీరు మృతి చెందారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. మృతులు 1981 నుండి 1990 వరకు అనంతరం 1994 నుండి చివరి శ్వాస వరకు అమెరికాలో జమాఅత్‌కు సేవలందించు అనుగ్రహం పొందారు. ఎమ్.టి.ఏ. టెలిపోర్ట్ అమెరికా స్థాపనలో వారు కీలక పాత్ర పోషించారు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. వీరు చాలా కృషి, శ్రమటోడ్చి పని చేసేవారు. టెక్నికల్ పనులను స్వయంగా కష్ట పడి నేర్చుకున్నారు. ఎంతో నైపుణ్యంతో పనిని ముందుకు కొనసాగించారు. మృతులు చాలా దుఆ చేసేవారు, ఖలిఫత్ అభిమాని, అతిథి మర్యాదలు చేసేవారు. ఒక ఆదర్శంతులైన జీవిత సమర్పితులని హుజూరె నఅ్వర్ కొనియాడారు.

(2) గౌ॥ అబ్దుర్రహ్మాన్ కుట్టి ఆఫ్ కేరళ గారు. గత కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. వీరు 16 సం॥ల వయసులో బైఅత్ చేయు అనుగ్రహం పొందారు. మృతులు నమాజులు, ఉపవాసాలకు కట్టుబడి ఉండేవారు, జమాఅత్‌తో వినమ్రపూర్వక సంబంధం కలిగి ఉండిరి. సాదా మనస్తత్వం కలిగి ఉండిరి. నిరాడంబరులు, సత్యమూర్తులు. మృతుని ఒక కుమారుడు గౌ॥ షంసుద్దీన్ మాలాబారీ గారు ముబల్లిఘ్ ఇంచార్జి కబాబీర్‌గా సేవలందించు అనుగ్రహం పొందు తున్నారు. వారు అంత్యక్రియ ప్రార్థనలో పాల్గొనలేక పోయారు. మృతుల క్షమాపణ, ఉన్నత శిఖరాల కొరకు హుజూరె అన్వర్ దుఆ చేసిరి.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*